నేటి దినపత్రిక
# సూర్య
కర్నూలు | నంద్యాల
శనివారం | 13 జనవరి 2024 | పేజీలు 8





స్వామి వివేకానందుని జీవితం

# యువతకు ఆదర్శప్రాయం

● కర్నూలు జిల్లా కలెక్టర్ జి.సృజన



నివాళులర్పిస్తున్న కలెక్టర్ జి.సృజన

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** స్వామి వివేకానందుని జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం అని జిల్లా కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం రాజ్‌విహార్ సెంటర్‌లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకుంటా రన్నారు. వివేకానందుని మార్గంలో పయనించి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలన్నారు. వివేకానందుడు యువతకు ప్రేరణనిచ్చే మిగతా 2లో

# అధికార పార్టీలో 'అగ్గి'






- ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు, ఒక ఎంపీకి టికెట్ నిరాకరించిన వైసీపీ అధిష్ఠానం
- మరికొన్ని నియోజకవర్గాల్లోనూ మార్పులు తప్పకపోవచ్చన్న సంకేతాలు
- రాజీనామా చేసిన ఎంపీ సంజీవ్‌కుమార్
- అదే బాటలో పార్టీని వీడిన కార్పొరేటర్ పద్మలత
- కొలిక్కిరాని టికెట్ల పంచాయతీ
- వేడెక్కుతున్న అసమ్మతి రాజకీయం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో**

అధికారపార్టీలో అసమ్మతి అగ్గి రాజుకుంటోంది. టికెట్ల పంచాయతీ లొల్లి రేపుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారిని నియోజకవర్గ ఇంఛార్జ్‌లుగా మారుస్తున్న నేపథ్యంలో వస్తున్న ఊహాగానాల వార్తలే పార్టీని కంపింపచేస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల ఇంఛార్జ్‌లను అధిష్టానం మార్చేసింది. కర్నూలు ఎంపి సంజీవ్‌కుమార్ స్థానంలో రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాంకు టికెట్‌ను ఖరారు చేసింది. నందికొట్కూరు, ఆళ్లగడ్డ, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు నంద్యాల ఎంపి స్థానానికి కూడా కొత్త అభ్యర్థిని తెరమీదకు తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో రాజీనామాల తంతు ప్రారంభమైంది. కర్నూలు ఎంపి సంజీవ్‌కుమార్ పార్టీకి, పార్లమెంట్ సభ్యత్వానికి ఇటీవలే రాజీనామా చేయగా, గురువారం కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 17వ వార్డు కార్పొరేటర్ పద్మలతా రెడ్డి రాజీనామా చేశారు. తెదేపా కండువా కూడా కప్పేసుకున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పార్టీ ఇంఛార్జ్‌గా నియమితులైన మాచాని వెంకటేష్ చుట్టూ అసమ్మతి మంట పెడుతోంది. నందికొట్కూరు నియోజకవర్గంలోనూ ఆశావహులు అధిష్టానం మాటను ధిక్కరిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. కోడుమూరు నియోజకవర్గ ఇంఛార్జ్‌గా మంత్రి ఆదిమూలపు సురేష్ సోదరుడు ఆదిమూలపు సతీష్ పేరును అధిష్టానం ప్రకటించింది. టికెట్ ఆశించిన ఆశావహులు అలకపూనినట్లు తెలుస్తోంది. ఏదో ఒక రోజు ఇది భగ్గుమనే పరిస్థితి ఉంది. ఆలూరు నియోజకవర్గంలో పార్టీలో చాలా కాలంగా ఉన్న వర్గవిభేదాలు తారాస్థాయికి చేరాయి. రెండు వర్గాలుగా విడిపోయిన మంత్రి గుమ్మనూరు, చిప్పగిరి జడ్పీటీసీ విరూపాక్షి వర్గాలు కొట్టుకునే స్థాయికి చేరాయి. విరూపాక్షిని నియోజకవర్గ ఇంఛార్జ్‌గా మిగతా 2లో

తహశీల్దార్ కార్యాలయంలో

## డిష్యుం... డిష్యుం..?

7లో..




సాధన చేస్తే

# ఉన్నత శిఖరాలకు ఎదగొచ్చు

- చాగంటితో విద్యార్థుల ముఖాముఖి
- విద్యార్థులు సంధించిన ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలిచ్చిన చాగంటి

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** సాధన చే స్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చున్న దానికి తానే ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు. మూడు రోజులుగా కర్నూలు నగరంలో ప్రవచనామృతాన్ని వినిపిస్తున్న ఆయన శుక్రవారం ప్రత్యేకంగా విద్యార్థులతో ముఖాముఖిలో మిగతా 2లో

- కేంద్రం రూ.988 కోట్లు జమ చేస్తే రూ.600 కోట్లు మళ్లించుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- వెంటనే జమ చేయాలని డిమాండ్ చేస్తున్న పంచాయతీరాజ్ ఛాంబర్
- కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్న బిర్రుప్రతాపరెడ్డి

మళ్లీ సర్పంచుల

# ఖాతాలు ఖాళీ



బిర్రు ప్రతాపరెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి కోసం మంజూరు చేస్తున్న నిధులను ప్రతి ఏటా తన ఖాతాలకు మళ్లించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అలాంటి చర్యకు పాల్పడింది. నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం రూ. 988 కోట్ల రూపాయలు జమ చేస్తే అందులో నుండి గ్రామసర్పంచ్‌లకు తెలియకుండానే రూ. 600 కోట్లు మళ్లించేసుకుంది. నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న ఈ తంతును సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పీటీసీలు తీవ్రంగా మిగతా 6లో



మాట్లాడుతున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ

# వీధి బడిలో చదివి చీఫ్ జస్టిస్‌గా

- ఎదగడానికి గురువులే కారణం
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** నేడు వీధి బడిలో చదివి, దేశ అత్యున్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్‌గా విధులు నిర్వర్తించానంటే దానికి కారణం నాకు విద్య నేర్పించిన గురువులేనని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. శుక్రవారం మిగతా 2లో

సూర్య



# అధికార పార్టీలో 'అగ్గి'

(మొదటిపేజీ తరువాయి)

నియమించడాన్ని గుమ్మనూరు వర్గం జీర్ణించుకోలేకపోతోంది. ఇక, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం టికెట్ కోసం పెద్ద సంఖ్యలో ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఇందులో ఎవరికి టికెట్ వచ్చినా మిగిలిన వాళ్లు పార్టీని వీడే పరిస్థితి కనిపిస్తోంది.

సింహభాగం సిట్టింగ్‌లను మార్చి కొత్తముఖాలతో ఎన్నికల బరిలోకి దిగేందుకు వైసీపీ అధిష్ఠానం తీసుకుంటున్న చర్యలు కొన్ని నియోజకవర్గాలకే పరిమితమైన అసమ్మతి చిచ్చు ఇప్పుడు అభ్యర్థులు మారే ప్రతి చోటా ఎదురవుతోంది. 2019 ఎన్నికల్లో జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయకేతనం ఎగురవేసిన వైసీపీలో ఎన్నికల తర్వాత కొన్ని నియోజకవర్గాల్లో రచ్చ ప్రారంభమైంది. నందికొట్కూరులో ఎమ్మెల్యే ఆర్థర్, నియోజకవర్గ ఇంఛార్జ్ బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మధ్య వీధి కొట్లాటల వరకు వెళ్లింది. అలాగే కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్, నియోజకవర్గ ఇంఛార్జ్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మధ్య పదేపదే ఘర్షణ వాతావరణం నెలకొంది. కర్నూలులో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి పార్టీని రెండుగా చీల్చేశారు. ఎవరికి వారుగా నియోజకవర్గంపై పట్టు కోసం వీధికెక్కారు. వీటన్నింటిని అధిష్ఠానం చూస్తూ కూర్చుండి పోయింది. ఎక్కడా విభేదాలను చల్లార్చే ప్రయత్నాలేవీ అధికార పార్టీ చేయలేదనడం అక్షర సత్యం.

తాజాగా ఈ ఏడాది జరగబోయే ఎన్నికలను ఎదుర్కొనేందుకు అనేక చోట్ల కొత్త వారికి అవకాశం ఇస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే మూడు చోట్ల సిట్టింగ్‌లకు టికెట్లను నిరాకరించింది. ఆలూరులో మంత్రి గుమ్మనూరు జయరాం స్థానంలో జడ్పీటీసీ విరూపాక్షిని నియోజకవర్గ ఇంఛార్జ్‌గా ప్రకటించింది. ఎమ్మిగనూరు కోటపై తిష్టవేసిన ఎర్రకోట కేశవరెడ్డికి టికెట్ నిరాకరించింది. చాలా కాలంగా ఆయనకే కాదు ఆయన కుటుంబంలో ఎవరికీ టికెట్ రాదంటూ ప్రచారం జరిగినా ఆయన సీనియారిటీని చూసిన వారెవరూ ఆ వార్తలు నిజం కాదని భావించారు. ఎవరెన్ని చెప్పినా కేశవరెడ్డి కుటుంబానికి టికెట్ నిరాకరించిన పార్టీ చివరకు ఆయన సూచించిన మాచాని వెంకటేష్‌ను నియోజకవర్గ ఇంఛార్జ్‌గా ప్రకటించి తేనెతుట్టెను కదిపింది. లైసెన్స్‌డ్ సర్వేయర్ అయిన మాచాని వెంకటేశ్ రాజకీయాలకు కొత్తనే చెప్పాలి. కేశవరెడ్డి ఆయనకు మద్ధతుగా నిలిచినా ఆయన వర్గం వెంకటేష్‌కు సహకరించదన్న భావన నియోజకవర్గంలో కనిపిస్తోంది. ఇది చేదు అనుభవమే అయినా పార్టీ అధిష్ఠానానికి ఇచ్చిన హామీ మేరకు వెంకటేష్‌కు మద్ధతుగా నిలవాలని కేశవరెడ్డి గట్టి నిర్ణయంతో ఉన్నారని చెబుతున్నారు. కోడుమూరు నియోజకవర్గం నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ స్థానంలో డాక్టర్ ఆదిమూలపు సతీష్ పేరును పార్టీ ఖరారు చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మరికొన్ని నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల మార్పుంటుందని భావిస్తున్నారు. నందికొట్కూరు నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్ స్థానంలోనూ కొత్త వ్యక్తిని బరిలోకి తెస్తారని భావిస్తున్నారు. నియోజకవర్గ ఇంఛార్జ్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి పేరును ప్రతిపాదిస్తుండగా, అధిష్ఠానం మాత్రం మరొకరి పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తన మాటను కాదని అధిష్ఠానం మరొకరికి టికెట్ కేటాయిస్తే సిద్ధార్థరెడ్డి ఎలా వ్యవహరిస్తారన్నది ఉత్కంఠను రేపుతోంది. మరో నాలుగైదు రోజుల్లో అన్ని నియోజకవర్గాలకు ఇంఛార్జ్‌లను వైసీపీ అధిష్ఠానం ప్రకటించే అవకాశం ఉంది. నలుగురు సిట్టింగ్‌లకు టికెట్లు నిరాకరిస్తేనే అధికారపార్టీలో చెలరేగిన అగ్గి మరిన్ని మార్పులు చేస్తే ఎలా ఉంటుందన్నది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. అగ్గి మీద గుగ్గిలం అవుతున్న నేతలను అధిష్ఠానం ఎలా బుజ్జగిస్తుందన్నది వేచి చూడాలి. 2019 ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన పార్టీ 2024 ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు రాబడుతుందనేది అత్యంత ఆసక్తిని రేపుతోంది.

స్వామివివేకానందుని జీవితం

# యువతకు ఆదర్శప్రాయం

(మొదటిపేజీ తరువాయి)

సూక్తులు, స్ఫూర్తివంతమైన సందేశాలను కలెక్టర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సీఈవో పివి.రమణ, రిట్లైర్ డాక్టర్ మోక్షేశ్వరుడు, నగరంలోని వివిధ విద్యాసంస్థల అధినేతలు పాల్గొన్నారు.

సాధన చేస్తే

# ఉన్నత శిఖరాలకు ఎదగొచ్చు

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలు చెబుతూ వారిని మైమరపింపచేశారు. పారిశ్రామికవేత్త టి.జి.భరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చాగంటిపై ప్రశ్నావలిని కురిపించారు. తాను కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగిగా పని చేసి పదవీ విరమణ చేశానని, తాను ఆ ఉద్యోగానికే పరిమితమై ఉంటే నలుగురిలో ఒకడిగా మిగిలే వాడినని, తెలుగు, సంస్కృతంపై ఉన్న అభిమానంతో ప్రవచనాలు చెప్పడం ప్రారంభించడంతోనే ఇలాంటి స్థితికి చేరుకున్నానని, ఇందుకోసం చాలా సాధన చేశానని ఆయన వివరించారు. తప్పులు చేయడం సహజమేనని, అయితే తప్పు చేసినప్పుడు దాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి వారిని క్షమాపణ కోరితే మనసుకు సంతోషంగా ఉంటుందని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. చేసిన తప్పులను దాచి పెడితే దానిపై ఆలోచనలతో చదువు వైపు దృష్టి సారించలేరని ఆయన చెప్పారు. మనసును ఎప్పుడూ ఉల్లాసంగా ఉంచుకోవాలని, ఎప్పుడైనా కాస్త ఇబ్బంది తలెత్తితే దాన్నుండి బయటపడేందుకు కమ్మటి కథలు వినాలని, భగవంతుడిని స్మరించుకోవాలని మార్గదర్శనం చేశారు. అధునాతన సాంకేతికతను ఉన్నత స్థాయికి వెళ్లేందుకు వీలుగా ఉపయోగించుకోవాలే తప్ప అందులోని అనవసరమైన విషయాలపై దృష్టి సారించకూడదని చాగంటి సూటిగా విద్యార్థులకు చెప్పారు. యూట్యూబ్ లాంటి సాధనలను వినియోగించుకుంటే చదువుకు అవసరమైన విషయాలను అందులోనుండి గ్రహించాలే తప్ప ఇతర అనవసర విషయాల జోలికి వెళ్లకుండా ఉండాలని ఆయన సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టంగా చదివితే మంచి ఉన్నత స్థానాలకు వెళ్లడం పెద్ద కష్టమేమీ కాదని ఆయన చెప్పారు. అభిరుచి ఉన్న రంగంలో ఇష్టపడి సాధన చేస్తే ఉన్నత స్థానాలు అందుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో టి.జి.భరత్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి బడిలో చదివి చీఫ్ జస్టిస్‌గా

(మొదటిపేజీ తరువాయి)



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ఎస్టీయూ 75వ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్‌వి.రమణతోపాటు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, తెలంగాణ రాష్ట్ర సీపీఐ కార్యదర్శి చానా వెంకటరెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయిశ్రీనివాస్, తిమ్మన్నలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌వి.రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైందని, ఉపాధ్యాయులు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యకు పెత్తపాట వేస్తూ అధిక నిధులు ఇస్తున్నప్పటికీ రాష్ట్రాల్లో విద్య మాత్రం కార్పొరేటీకరణ అయిపోయిందన్నారు. తల్లిదండ్రులు కార్పొరేట్ మాయలో పడి తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు పంపేందకు మొగ్గు చూపుతున్నారే తప్ప ప్రభుత్వ పాఠశాలల వైపు అడుగులు వేయకపోవడం బాధకరమన్నారు. ప్రతి విద్యార్థిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుడిపై ఉందని, ఆ విధంగా ఉపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ విద్యాసంస్థల్లో సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీఎం జగన్ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించారన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ సీఎం జగన్ మన బడి-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రూపురేఖలను మార్చేశారన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించే మహోన్నత వ్యక్తి ఉపాధ్యాయులేనన్నారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులను తనిఖీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు వేధించడం బాధకరమన్నారు. ఉపాధ్యాయులకు సరైన సమయంలో వేతనాలు ఇచ్చి గౌరవించాలని సూచించార. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్ది వారిని దేశాభివృద్ధిలో పాటుపడేలా ఉపాధ్యాయులు అందరూ ఎందరికో ఆదర్శమన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయిశ్రీనివాస్, తిమ్మన్నలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో 75సంవత్సరాలుగా ఎస్టీయూ ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అండగా ఉండి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్టీయూ నిరంతరం పోరాడుతుందన్నారు. అనంతరం ఎస్టీయూ లోగోతోపాటు డైరీని ఆవిష్కరించారు. అంతకు ముందు ఎస్టీయూ జిలల్లా అధ్యక్షుడు గోకారి అధ్యక్షతన నగరంలోని శ్రీకృష్ణదేవరాలయ విగ్రహం నుంచి 26జిల్లాలకు చెందిన ఎస్టీయూ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ర్యాలీ రాజ్‌విహార్ మీదుగా కిడ్స్ వరల్డ్ వరకు జరిగింది. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# వైసిపిలో రగిలిన ఆగ్రహ జ్వాలలు

- ★ జగన్ ఫ్లెక్సీల చించివేత
- ★ రెబల్‌గా సంధ్యావిక్రమ్ రంగంలోకి
- ★ స్వతంత్రంగానైనా బరిలోకి మురళీ అభిమానులు

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైసిపి అధిష్టానం కోడుమూరు నియోజకవర్గం ఇన్‌చార్జీగా అధిష్టానం ఆదిమూలపు సతీష్‌ను ప్రకటించడంతో శుక్రవారం నియోజకవర్గంలోని వైసిపి కార్యకర్తల్లో ఆగ్రహజ్వాలలు రగిలాయి. కార్యకర్తల సవావేశంలో సంధ్యావిక్రమ్ అభిమానులు రెబల్‌గా దిగాల్సిందేనని పట్టపట్టగా, మురిళీకృష్ణ అభిమానులు జగన్ ఫ్లెక్సీలను చించి తగులబెట్టి నిరసన తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలోకి దిగాల్సిందేనన్నారు పార్టిజెండాను బుజాన మోసిన నాయకులకు అధిష్టానం అన్యాయం చేసి స్థానికేతరులకు కేటాయిస్తే కోడుమూరులో వైసిపి డిపాజిట్ కూడా దక్కదని వైసిపి నాయకులు, అభిమానులు మండిపడ్డారు.



**సంధ్యావిక్రమ్ రెబల్‌గా నిలబెడతాం :** నియోజకవర్గంలో వైసిపి పార్టికోసం అహర్నిశలు శ్రమటోడ్చి పనిచేసిన సంధ్యావిక్రమ్‌కుమార్‌ను వైసిపి అధిష్టానం గుర్తించకపోతే రానునకన ఎన్నికల్లో వైసిపి రెబల్‌గా బరిలోకి నిలబెడతామని వైసిపి నాయకులు అన్నారు. వైసిపి అదిష్టానం మరొక్కసారి సమీఓఇంచుకోవాలని రాష్ట్రకమిటి నాయకులు సంధ్యావిక్రమ్ కుమార్ అన్నారు ఉదయమే తరలివచ్చిన తన అనుచరులతో వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. మాప్రియతమ నాయకుడు సియం జగన్ వైనాట్ 175 దిశగా మమ్మల్ని ప్రయాణం చేయాలన్నారు. జగన్న సారద్యంలో,కోట్ల హర్షన్న నాఆయకత్వంలో ప్రతిగ్రాంలోనూ వైసిపి ఎండాను ఎగురవేసేవిదంగా పనిచేశాను అన్నారు. 12 సంవత్సరాలుగా పార్టీలో కార్యకర్తగా పనిచేశాను,5 సంవత్సరాలనుండి నువ్వేకావాలి నువ్వేరావాలి జగనన్నా, వన్స్‌మోర్ జగనన్నా,నేనుసైతం జగనన్నా, 16 జిల్లలను 26 జిల్లాలుగా మార్చిన విదానాన్ని, మూడురాజదానుల ఆవథ్యకతను ప్రజల్లోకి తీసుకుపోవడంకోసం కుటుంబాన్ని వదలి కార్యకర్తలకు అండగా పనిచేశానని తెలిపారు. అయితే ప్రజాక్షేత్రంలో ప్రజల్లో పరిచయంలేని వారిని, స్థానికేతరులను తీసుకొచ్చి ఇన్‌చార్జీలుగా ప్రకటించి, 2024 ఎన్నికల్లో సీట్లిస్తే వైనాట్ 175 లక్ష్యసాధన నీరుగారుతుందని వారు ఆందోళనవ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో జరుగుతున్న వాస్తవవిషయాలను తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని పార్టి నాయకులు, కార్యకర్తల



నిర్ణయాలను, ఐప్యాక్ సర్వే నిర్ణయాలను మరొక్కసారి పరిశీలించాలని తమ ఆవేదనను స్వీకరించి మరొక్కసారి నిర్ణయం తీసుకోవాలన్నారు. వైయస్సార్ పార్టిని, జగన్‌మోహన్‌రెడ్డి ,కూడా చైర్మన్ నమ్ముకొని పనిచేసిన మాకు తీరని అన్యాయం జరుగోతందన్నారు. నియోజక వర ్గప్రజలకు గుర్తింపులేని వ్యక్తులను తీసుకొచ్చి రుద్దతే, పార్టి కార్యక్రమాల్లోనూ, కార్యకర్తలెవరో తెలియని స్థానికేతరులను అదిష్టానం నిర్ణయిస్తే పార్టి నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేరకి వారు ఆందోళన వ్యక్తం చేశారు.

**స్వతంత్ర అభ్యర్థిగా మురళిని గెలిపించు కొంటాం :** వైసిపి పార్టి ఆరంబంనుంచే మురళీకృష్ణ జగన్‌కు విదేయుడిగా పని చేశారని,పార్టి కార్యకర్తల కుటుంబంలో సభ్యడిగా ఉన్నడని అలాంటి మా నాయకుడిని గాకుండా ప్రకాశంనుండిజిల్లా వారికి టికెట్ కేటాయిస్తే మానాయకున్ని స్వతంత్ర అభ్యర్థిగా గాని గెలిపించుకుంటామన్నారు. పరిగెల మురళీకృష్ణ నివాసం వద్ద అదికసంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి జగన్,ఫ్లెక్సీలనుచించి కాల్చివేశారు. జగన్ మోసం చేస్తున్నాడని మొదటినుంచి చెప్పినా మా నాయకుడు మురళి వినలేదని సియం జగన్‌ను గుడ్డిగా నమ్మిమోసపోయామని వారు ద్వజమెత్తారు. 2009లో మోసం జరిగింది,అదేవిదంగా 2024 ఎన్నికల్లోకూడా మా నాయకునికి మోసం జరిగితే సహించమన్నారు. మొకంకూడ చూడలేని వారిని,డబ్బులకోసం ప్రకటిస్తే ఎలా ఒప్పుకుంటామని మురళికి టికెట్ వైసిపి ఇవ్వకపోతే కచ్చితంగా రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగానైనా రంగంలోకిదింపి గెలిసించుకుంటామని పరిగెల అభిమానులు అదిష్టానానికి సవాల్ విసిరారు.

**అదిష్టానం నిర్ణయమే శిరోదార్యం ఎమ్మెల్యే**

పార్టి అదిష్టానం నిర్ణయమే శిరోదార్యంగా పని చేద్దమని, పార్టి అదిష్టానం కొత్తవ్యక్తిని ప్రకటించిందని ఎవరూ ఆవేశాలకు గురికావద్దని ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. కార్యకర్తల సమావేశంలో పార్టి మరోసారి టికెట్ ఇస్తుందని,సర్వేలల్లో తనపేరు ఉందని అటువంటిది పార్టి తీసుకున్న నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలన్నారు.

# పలు కిడ్నాప్ కేసులలో.. ముద్దాయిలు అరెస్టు..

టాటా సుమో.. సెల్ ఫోన్లు స్వాధీనం..



విలేకరుల ఎదుట నిందితులను ప్రదర్శిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అహోబిలంలో ఈనెల 4 న టాటా సుమో వాహనాన్ని కొందరు వ్యక్తులు దొంగలించి ప్రొద్దుటూరుకు చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన ముఠాను శుక్రవారం సిఐ హనుమంతు నాయక్, రూరల్ ఎస్సై నరసింహులు బృందం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆళ్లగడ్డ డి.ఎస్.పి వెంకటరామయ్య మాట్లాడుతూ 2003 లో బీచుపల్లి ఏపీఎస్పీ బెటాలియన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తూ డిస్మిస్ అయిన రుద్రవరంకు చెందిన గోసా నాగేంద్రుడు అనే వ్యక్తి చెడు సావాసాలకు అలవాటు పడి కొందరు చెంచు వ్యక్తులతో జతకట్టి సమాజంలో డబ్బున్న వ్యక్తులను రెక్కీచేసివారిని టార్గెట్ చేసికిడ్నాప్ చేసిడబ్బులు వసూలు చేసే దురాలోచనతో మొత్తం నాలుగు కిడ్నాప్లకు ప్రయత్నించి అన్నింటా విఫలమయ్యారన్నారు. వీరిని శుక్రవారం అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు బయటపడినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. తమ విచారణలో పలు కేసులలో వీరు ముద్దాయిలుగా ఉన్నారని డీఎస్పీ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్సై నర్సింహులు పెద్ద కందుకూరు మెట్టవద్ద ఉండగా ముద్దాయిలు తాము దొంగలించిన టాటాసుమో వాహనంలో చాగలమర్రి వైపు నుండి ఆళ్లగడ్డ వైపు వస్తూ పోలీసులను గమనించి సుమోను ఆపి పారిపోయే ప్రయత్నం చేయడంతో సిబ్బంది వెంటనే వారిని పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందని డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం 8మంది ముద్దాయిలు ఉండగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. ఎంతో చాకచక్యంతో ఈ కేసును చేదించిన రూరల్ సీఐ హనుమంత నాయక్, వారి సిబ్బంది రూరల్ ఎస్సై నరసింహులు, ఏఎస్ఐ సురేష్ రెడ్డి, కానిస్టేబుల్ నాగరాజు, రాధాకృష్ణ,వెంకటేశ్వర్లు, హోంగార్డు ప్రతాప్, భాస్కర్‌లను నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి అభినందించడం జరిగిందని ఆళ్లగడ్డ డి.ఎస్.పి వెంకట్రామయ్య వివరించారు.

# ఘనంగా నేషనల్ యూత్ డే



గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న అవోపా నాయకులు

**ఆదోని,మేజర్ న్యూస్ :** ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఘనంగా వివేకానంద స్వామి 162వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక గట్టు బాలికల ప్రభుత్వ పాఠశాలలో వివేకానందుని జయంతిని పురస్కరించుకొని వారు చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను, ఆశయాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆవోపా పట్టణ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ, 162మంది బాలికలకు వివేకానంద వ్యక్తిత్వ వికాసం గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తొలుత వివేకానంద ఆశయాలను సమాజంలోని యువత బాధ్యత, వారి నడవడిక దేశానికి వారి వలన అవసరమన్న ఆశయంపై పిల్లలకు వివరించారు. అనంతరం ఉపాధ్యక్షులు ప్రతాప్ ఈరన్నశెట్టి మాట్లాడుతూ, ఉత్తీర్ణులైన పిల్లలకు ఒకటి,రెండు,మూడవ బహుమతులు ఇచ్చి 15మంది కన్సలేషన్ ప్రొత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజేతలకిచ్చిన బహుమతుల సౌజన్య కర్తలు మహిళా విభాగ అధ్యక్ష కార్యక్రమాలు బుధూరు సంగీత, వంకదారు మమతశ్రీ, కోశాధికారి ప్రతాప్, హేమ బిందు, అవోపా అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, మిరియాల శ్రీధర్, సలహాదారులుగా డైమాండ్ రఘు, బాలికల పాఠశాల ఉపాధ్యాయురాలు జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టింది వైసీపీ ప్రభుత్వం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎస్సి సంక్షేమ హాస్టల్లు దుర్భర దుస్థితిలో ఉన్నాయని కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమాన్ని సంక్షోభంలోకినెట్టేసింది టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మాదిగ నాగరాజు,రంజిత్ కుమార్,రమేష్ నాయుడు లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సి సంక్షేమ హాస్టల్ ను సందర్శించారు. వారు మాట్లాడుతూ పిల్లలకు కనీస దుప్పట్లు, కాస్మెటిక్ ఛార్జీలు ఇవ్వలేక పోతుందని దుయ్యా బట్టారు. అలాగే సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఉంటూ ఇరుకు గదుల్లో పదుల సంఖ్యలో పడుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, వైకాపా ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్రను విడి సంక్షేమ హాస్టళ్లను నిర్మించాలని లేని పక్షంలో తీవ్ర ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ సురేంద్ర, శశి,నరేష్, లింగన్న,ఐటిడిపి సోషల్ మీడియా అధ్యక్షులు రాంపురం రఫీక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న టీఎన్ ఎస్ ఎఫ్ నాయకులు

# గ్రామాల అభివృద్ధి ఏదీ..?

**– రహదారులు అధ్వానంగా మారినా పట్టించుకోని సీఎం..**
**– సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపుదాం**



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి

**కౌతాళం, మేజర్‌న్యూస్:** గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని, గ్రామీణ ప్రాంతాల రహదారులు అధ్వానంగా మారాయని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కౌతాళం–హాల్వి గ్రామాల రహదారిని పరిశీలించారు. అధ్వానంగా మారడంతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆడుదాం–ఆంధ్ర కాదు మార్చుదాం ఆంధ్ర అని ప్రజలు అంటున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి పాతాళంలో కూరుకుపోయిందని, లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారయ్యిందని, కనీసం రోడ్ల మీద ఉన్న గుంతలను కూడా పూడ్చలేని స్థితిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉండిపోయారన్నారు. వై నాట్ 175 అంటున్నారని, ఈసారి వైనాట్ పులివెందుల అని మేము అంటున్నామని చెప్పారు. ఆడుదాం–ఆంధ్ర అని వందల కోట్లు దోచుకోవడానికి, పెట్టిన దాంట్లో అంతా వైసీపీ నాయకుల దోపిడీకి గురైన విషయం అందరికీ తెలుసునని చెప్పారు. అందుకే మీరు ఆడుదాం ఆంధ్ర అంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు మార్చుదాం ఆంధ్రప్రదేశ్ అని అంటున్నారని, ఈసారి జగన్‌మోహన్‌రెడ్డి మార్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కోసిగి, కౌతాళం మండలాల కన్వీనర్లు, సీనియర్ నాయకులు, గ్రామాల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఐ టీడీపీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాయికాట్ జిందాల్ లారీలు



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు

**గడివేముల, మేజర్‌న్యూస్:** గడివేములలో జిందాల్ పరిశ్రమ భారీ లారీలు తిరిగితే సహించేది లేదని రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల నేతలు భారీ ఎత్తున గడివేముల మండల కేంద్రంలో ఆందోళన, ధర్నా నిర్వహించారు. గురువారం గడివేములలో జిందాల్ ఫాక్టరీకి సంబంధించిన లారీ ఢీకొని మహిల మృతి చెందిందని అలాగే గతంలో భారీ వాహనాల ద్వారా మృతిచెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా ముస్లిం సంఘాల నాయకులు ధర్నాలు, నిరసనలో పాల్గొని కొత్త బస్టాండు ఎదురుగా మానవ హారంగా ఏర్పడి రస్తారోకో నిర్వహించారు. గడివేముల మండలంలో యువతకు, ప్రజలకు జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల ఎలాంటి ఉపయోగం లేదని జిందాల్ హటావో గడివేముల బచావో అనే నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ బిటి.వెంకట సుబ్బయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగ నాయకులు ఆధ్వర్యంలో జిందాల్ ఫ్యాక్టరీ ఎదురుగా కూర్చొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. మృతిచెందిన కుటుంబాలకు జిందాల్ యాజమాన్యం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబా ఫక్రుద్దీన్, నాగరాముడు, ధనుంజయ్, రాయలసీమ విద్యార్థి యువజన జేఏసీ చైర్మన్ రాజనాయుడు, కన్వీనర్లు తెలుగు రవీంద్రనాథ్, షేక్ రియాజ్, ముద్దం నాగనవీన్, నాగ సుంకన్న, బత్తిని ప్రతాప్, వనం వెంకటాద్రి, ప్రసాద్, మౌలాలి పాల్గొన్నారు.

# బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ – మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** బాబుతోనే రాష్ట్రానికి రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు గ్యారంటీ ఉంటుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని భాగ్య నగరం గ్రామంలో భవిష్యత్తు గ్యారంటీ అని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ముందుగా ప్రజా వేదిక నిర్వహించి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామాలలో పారిశుధ్యం లోపించిందని ఎక్కడ చూసినా డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైందని ఉద్యోగాలు లేక యువత దిక్కుతోచనిస్థితిలో ఉన్నారని ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాడని ఆమె అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలండర్ వదులుతానని ఉత్తమ కుమార ప్రగ్బాలు పలికి ముఖ్యమంత్రి అయ్యాక యువతను నట్టేట ముంచిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందని ఆమె ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి జగన్ ప్రభుత్వం ప్రజలపై అనేక పన్నుల రూపంలో నడ్డి విరిసిందని రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అండగా ఉండి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడిని చేసుకోవాలని అందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్ది సత్యనారాయణ, భూమా ప్రభాకర్ రెడ్డి, దయానందరావు, సురేంద్ర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ముగ్గులతో అంగన్‌వాడీల నిరసనదీక్ష



ముగ్గు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** అంగన్‌వాడీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు సంక్రాంతి ముగ్గును వేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి మండల అధ్యక్షుడు బి.మాధవస్వామి మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన దీక్షను ప్రభుత్వం పట్టించుకోకుండా, వారి సహనాన్ని పరీక్షిస్తుందని, మున్ముందు సమ్మె తీవ్రరూపం దాల్చకముందే డిమాండ్లను నెరవేర్చాలన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో శిరీష, వెంకటేశ్వరమ్మ, సుజాత, మాణిక్యమ్మ, బేబీలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, క్రిష్ణగిరి, వెల్దుర్తి ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి ఎస్.చాందినీ, వరలక్ష్మి, ఈదమ్మ, రేణుక, సుజాత, సావిత్రీతోపాటు సుమారు 200ల మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి పై ప్రణాళిక సమావేశాలు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** ఈనెల 15 నుంచి గ్రామాల అభివృద్ధికై ప్రణాళిక సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహబూబ్ దోలా తెలిపారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళిక కొరకు కమిటీలను ఏర్పాటు చేశారని 17న చాగలమర్రి, సెట్టి వీడు, చింతలచెరువు, గోడిగనూరు, డి.వనిపెంట,పెద్దవంగలి,కెవి.తాండ,18వతేదీన మల్లీ వేముల,గొట్లురు, మద్దూరు, పెద్ద భోదనం, చిన్న భోదనం, నెలంపాడు, రాంపల్లి, మల్లీవేముల, తోడేళ్ల పల్లె, బ్రాహ్మణ పల్లె గ్రామాలలో గ్రామసభలు నిర్వహించబడతాయన్నారు.ఆయా గ్రామ సర్పంచులు అధ్యక్షతన ఎంపీపీ జడ్పిటిసి సభ్యురాలు ఎంపిటిసిలు కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు.

# పార్టీ విజయం కోసం సైనికుల్లా పని చేయండి: మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ


వైసీపీ నుండి టిడిపిలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** పాత కొత్తగా చేరిన తెలుగుదేశం కార్యకర్తలు అందరూ పార్టీవిజయం కోసం సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి భూమాఅఖిలప్రియ కోరారు. శుక్రవారంచాగలమరి మండల పరిధిలోని తోడేండ్లపల్లి గ్రామంలో30 వైసిపినుండి టిడిపి పార్టీలోకి చేరారు. గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ మాధవిలత, నాయకులు బుడిగి నరహరి, హరిచంద్ర, చెంచు రాజు, రాజు, పాముల రమణ, శ్రీనివాసులు,శివారెడ్డితో పాటు30కుటుంబాలు పార్టీలకు ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ వీధి విధానాల నచ్చక తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోకు ఆకర్షితులై పార్టీలో చేయడం జరిగిందన్నారు. మాపై నమ్మకంతో వచ్చిన వారిని కలుపుకొని పనిచేయడం జరుగుతుందన్నారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక గౌరవం ఉంటుందన్నారు. అందరూ కలిసి ఆళ్లగడ్డ టిడిపి జెండా అత్యధిక మెజార్టీతో ఎగురవేసి చంద్రబాబుకు బహుమతిగా ఇవ్వాలన్నారు. ఆళ్లగడ్డ లో జరిగిన రా కదిలిరా సభను విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలుతెలియజేశారు. ఈ కార్యక్రమంలోఆళ్లగడ్డ నియోజకవర్గ యువ నాయకులు భూమాజగద్విఖ్యాత రెడ్డి, భార్గవరాం నాయుడు, కందుకూరు శ్రీను, బోయలకుంట్ల శ్రీకాంత్ రెడ్డి, న్యాయవాది శివరాం రెడ్డి, తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్మెస్ అన్సర్ భాష, పార్టీ కన్వీనర్, లాయర్ నరసింహారెడ్డి, తోడెలపల్లె శ్రీనివాసరెడ్డి, మోహన్, జిల్లా మైనార్టీ నాయకులు, కొలిమి హుస్సేన్ వల్లి కొలిమి కొలిమి షరీఫ్,ఇండ్ల లక్ష్మిరెడ్డి, ఇండ్ల రమణారెడ్డి, గుత్తి నరసింహుడు, రాంపల్లి లక్ష్మిరెడ్డి, పట్టణ కార్యదర్శి హనీఫ్, పెద్ద వంగలి నాగేంద్ర కుమార్‌యాదవ్, సంజీవరెడ్డి, చిన్న భోదనం రమణారెడ్డి, రామసుబ్బయ్య, చిక్కంటి రామకృష్ణ, ప్రమోద్, సుబ్రహ్మణ్యం, ఒంటెద్దు లక్ష్మిరెడ్డి, జనార్దన్ రెడ్డి, మోహన్, పాల్గొన్నారు.

# ప్రజాభీష్టం నెరవేర్చడమే ప్రభుత్వ ప్రథమ ధ్యేయం

- యువనేత జయమనోజ్ రెడ్డి
- గడప గడపకూ వెళ్లి ఆత్మీయ పలకరింపు

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ప్రజల అభీష్టం నెరవేర్చడమే ప్రభుత్వ ప్రథమ ధ్యేయమని ఆదోని నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్, యువనేత జయమనోజ్‌రెడ్డిఅన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండిగిరి పరిధిలోని పద్మశాలి నగర్, బీవీఆర్ ఎస్టేట్ కాలనీలలో మండిగిరి మాజీ సర్పంచ్ శేషిరెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. యువనేత లబ్ధిదారులతో మమేకం అవుతూ పథకాల అమలు తీరును అదేవిధంగా వార్డు సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని అలాగే మా కాలనీకి ఒక వాలంటీరు, రేషన్ బండి కావాలని బీవీ ఆర్ ఎస్టేట్ కాలనీవాసులు జయమనోజ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే ఆయన స్పందించారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సురేష్ అనే వాలంటీరుని ఆ కాలనీకు బాధ్యతలు అప్పగించారు. రేషన్ బండిని కూడా త్వరగానే ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు అదేవిధంగా ఈ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు బాగున్నాయా లేదా? అన్నది తెలుసుకునేందుకే గడప గడపకూ వస్తున్నాం అని జయమనోజ్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే నియోజకవర్గం అంతటా ఇదే విధంగా తిరుగుతూ ప్రజాభిప్రాయాన్ని వినేందుకు, వారి సమస్యలను గుర్తించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం యువనేత గడప గడపకూ వెళ్లి ఏమ్మా ఎలా ఉన్నారు? ఏమైనా సమస్యలు ఉన్నాయా ? అంటూ.. స్థానికులను ఎంతో ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, వైసీపీ నాయకులు కల్లుపోతుల సురేష్, సన్నీ, పెద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ధర్మేంద్రరెడ్డి, స్థానికులు మోక్షిత రాఘవేంద్రరెడ్డి, రఘునాథ్ రెడ్డి, రఘు, జగన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కాలనీవాసులతో యువనేత జయమనోజ్ రెడ్డి

# ఆళ్ళగడ్డ వాసులు నేను వస్తానంటే వద్దంటారా

- పార్టీ ఆదేశిస్తే ఆళ్ళగడ్డ నుంచైనా పోటీ
- శిల్పా హుందాతనంగా మాట్లాడితే మంచిది
- నా బలం..నా ఆస్తులు.. అన్నీ అక్కడే
- తెలుగుదేశం పార్టీ విజయానికి ఎక్కడైనా కృషి చేస్తా..
- టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డి


మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నేను వస్తానంటే వద్దంటారా ఆళ్లగడ్డ వాసులు అంటూ.. పార్టీ ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని..నా బలం..నా ఆస్తులు అన్నీ అక్కడేనని టీడీపీ నేత, మాజీ ఆర్ఐసీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిటీ కేబుల్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఏవీ మాట్లాడుతూ వైసీపీ పార్టీ మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి ముస్లింల మనోభావాలను దెబ్బతినే విధంగా మాట్లాడడం మంచిది కాదని ఎంతో అనుభవం ఉన్నా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని అన్నారు. మతసామరస్యం దెబ్బతీయడానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన బ్యానర్లు ఏర్పాటు చేయడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యానర్లు ఏర్పాటు చేసిన వారిపై పోలీసులు విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంట్ పరిధిలో దాదాఉ 3లక్షల మంది మైనారిటీలు ఉన్నారని తెలిపారు. నంద్యాలలో హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా ఉంటారని అన్నారు. ఇద్దరి మధ్య చిచ్చుపెట్టే విధంగా పోస్టర్లు వేయడం మతసామరస్యానికి భంగం కలిగించే విధంగా ఉందన్నారు. మీకు ఆళ్ళగడ్డ టిక్కెట్ ఇస్తే పోటీ చేస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు తెలుగుదేశం పార్టీ ఆ అవకాశం ఇస్తే ఆళ్ళగడ్డలో పోటీ చేసి గెలుస్తానన్నారు. ఆళ్ళగడ్డ పట్టణంలో రా కదలిరా బహిరంగ సభకు హాజరుకాక పోవడానికి కారణం ఏమిటని అని అడుగగా గతంలో నారా లోకేష్ యువగళంలో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీ ఆదేశం మేరకు జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పరిశీలకులు ప్రభాకర్ చౌదరిలు తన నివాసానికి వచ్చి రిక్వెస్ట్ చేసుకున్నారని ఏదైనా అనుకోని సంఘటన జరిగితే జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు, పార్టీకి చెడ్డపేరు వస్తుందని పార్టీ శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని సభలో పాల్గొనలేదన్నారు. తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగానంద్యాలలో ఫరూక్, భూమా బ్రహ్మానందరెడ్డిలు ఇరువురూ పార్టీ కోసమే కష్టపడుతున్నారన్నారు. ఆళ్ళగడ్డలో జరిగిన రా కదలిరా నినాదానికి సభకు జిల్లా లోనిఅన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కదలి రావడంతో సభ విజయవంతమైందన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందని చంద్రబాబు సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

# ఏపీ యూఎస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు స్థానిక భారతి విద్యా మందిరంలో ఘనంగా జరిగాయి. ఏపీ యూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగాపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్త జిల్లా కార్యదర్శి విప్ర నారాయణ చారి మాట్లాడుతూ స్వామి వివేకానందుని బోధనలు ఆదర్శమని అన్నారు. యువత ఆయన బోధనలను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీపతి, రామకృష్ణ, ఉపాధ్యాయులు మునిమోహన్, శ్రీహరి, రామాంజనేయులు, నరసింహులు, సుధాకర్ రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందుడే యువతకు స్ఫూర్తి

**గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు..**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** భారతదేశ యువతకు వివేకానంద స్ఫూర్తి ప్రదాత అని గ్రీన్ సొసైటీ గౌరవ అధ్యక్షులు శ్రీ నిధి రఘువీర్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలో శ్రీ వివేకానంద సెంటర్ నందు స్వామి వివేకానంద విగ్రహానికి సొసైటీ సభ్యులు మాలార్పణచేశారు. అనంతరంసొసైటీ అధ్యక్షుడు దండు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో గ్రీన్ సొసైటీ ఏర్పాటుచేసి విద్యార్థులకు యువతకు మార్గదర్శకత్వంవహించే విధంగా అనేక కార్యక్రమాలు నంద్యాలపట్టణంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాస రెడ్డి, రామసుబ్బారెడ్డి సంతోష్, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

**విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే సతీమణి, సోదరి**

**ఆళ్లగడ్డ, మెజర్ న్యూస్ :** స్థానిక మార్కెట్ యార్డ్ లో శుక్రవారం శాసనసభ్యులు గంగుల నాని సతీమణి సారికా రెడ్డి, సోదరి అవంతిక రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చిముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ముగ్గుల ఫోటోలు మంచి ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలలో మిట్టపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ అనే దివ్యాంగుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రాన్ని ముగ్గుతో వేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రసాదును గంగుల సారిక రెడ్డి, అవంతిక రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణీతలుగా సుజాత, నాగలక్ష్మి లు వ్యవహరించారు. అనంతరం ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారందరికీ అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది. కౌన్సిలర్లు గొట్లూరు, సుధాకర్ రెడ్డి, వరాలమ్మ, రాధమ్మ, బద్రి నాగేశ్వరమ్మ, న్యాయవాది సరితా రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వినోద్ కుమార్, గంగుల రామిరెడ్డి, బద్రి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలను పర్యవేక్షిస్తున్న దృశ్యం

# అంగన్‌వాడీ ధర్నాకు కాంగ్రెస్ సంఘీభావం


మద్ధతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడిలు సమస్యల పరిష్కారం చేపట్టిన దీక్షలకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్ధతు ఇచ్చింది. అంగన్‌వాడి చేసే న్యాయమైన ధర్నాకు కాంగ్రెస్ మద్ధతు ఉంటుందని తెలిపింది. కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడిలు చేపట్టిన నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, అనుబంధసంఘాల నాయకులు జాన్‌విల్సన్, కరుణాకర్‌బాబు, పోతల శేఖర్, ప్రమీల, షేక్‌ఖాజాహుసేన్, ఎజాస్‌అహ్మద్, ఖాద్రిపాష, సుబ్రహ్మణ్యం, దేవకుమార్, ఆనందం, జేమ్స్, లలిత, హైమావతి పాల్గొన్నారు.

## బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు

# సంక్రాంతి శుభాకాంక్షలు – మాజీ ఎమ్మెల్యే బీసీ

**బనగానపల్లెమేజర్,న్యూస్ః**


మాజీ ఎమ్మెల్యే బీసీ (ఫైల్‌ఫోటో)

బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. రైతులు తమ పంటలు ఇంటికొచ్చిన వేళ సంతోషంగా చేసుకొని అచ్చ తెలుగు పండుగ సంక్రాంతి అని అన్నారు. బనగానపల్లె , కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, అవుకు మండల ప్రజలు ఆనందంగా ఈ సంక్రాతి వేడుకలు జరుపుకోవాలని వారందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలను తెలియజేశారు.

# మాయమాటలు చెప్పి కండువాలు వేయడం సిగ్గుచేటు

**ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య**

**ప్యాపిలి,మేజర్‌న్యూస్ః** అభివృద్ధి చేయడం చేతకాక, ప్రజలకు మాయమాటలు చెప్పి వారికి ఇష్టం లేకుండానే రాజకీయంగా పార్టీ కండువాలు కప్పి టిడిపిని వీడి వైకాపాలో చేరారు అని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని ప్యాపిలి మండల టిడిపి అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య అన్నారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయం నందు ఆయన మాట్లాడుతూ 11వ తేది మండల పరిధిలోని కలచట్ల గ్రామ పంచాయతీలోని ఎస్.రంగాపురం గ్రామానికి చెందిన కొంతమంది టిడిపి నాయకులను ఎరుకల సంఘం సమావేశం ఉంది అని మాయమాటలు చెప్పి, వైయస్ఆర్ పార్టీ కండువాలు కప్పి, వైకాపాలో చేరినట్లు ప్రకటించుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మాయమాటలు చెప్పి పార్టీ కండువాలు వేసే పద్ధతిని మార్చుకోవాలని ఆయన వైయస్ ఆర్ పార్టీ నాయకులకు సూచించారు. అనంతరం గండికోట రామసుబ్బయ్య అధ్యక్షతన శుక్రవారం తిరిగి టిడిపిలోకి వారిని ఆహ్వానించారు. ఎస్.రంగాపురం గ్రామ టిడిపి నాయకులు రంగస్వామి,జయరాముడు,నాగన్న, రాముడు, చిన్నపెద్దయ్య, మోహన్, నాగేశ్వర రావు, రమేష్, సుధాకర్, రామాంజి, కలచట్ల గ్రామ టిడిపి నాయకులు కలచట్ల జయప్రసాద్, మాజీ సర్పంచ్ దెబ్బల రామాంజినేయులు,రవికుమార్, రాజశేఖర్, పరదేశి రామాంజినేయులు, పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**పాములపాడు , మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పాములపాడు మండలంలోని శ్రీ వివేకానంద విద్యావిహార్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ఆర్ ఎస్ ఆర్ గోపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను ఔన్నత్యాన్ని చాటి చెప్పిన ఘనత స్వామి వివేకానంద ప్రపంచ దేశాలకు చాటి చెప్పారన్నారు.రామకృష్ణ పరమహంస ప్రథమ శిష్యుడిగా భారతీయ ఆధ్యాత్మిక చింతనను, జీవిత వైవిధ్యాలను యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండే ఎన్నో ప్రవచనాలను అందించిన మహా మేధావి స్వామి వివేకానంద అని అన్నారు. చికాగో నగరంలోని సర్వమత సమ్మేళనంలో ప్రపంచ ప్రతినిధుల ముందు భారతీయ ప్రాచీన వైవిధ్యాన్ని, ప్రకృతి వనరుల సౌందర్యాన్ని, పారదర్శక జీవన విధానాన్ని ప్రపంచ దేశాలకు అర్థమయ్యేలా వివరించిన ఘనత స్వామి వివేకానంద ఆధ్యాత్మిక వేత్తదే అని అన్నారు.భారత ప్రభుత్వం జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు. భారతీయ యువతీ, యువకులు స్వామి వివేకానంద సూక్తులను ఆయనను మార్గదర్శకంగా అనుసరించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయనీ యులు, విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రియాంకగాంధీ పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు బర్త్‌డే కేక్ కట్ చేసి ప్రియాంక గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జాన్‌విల్సన్, పీసీసీ ప్రధాన కార్యదరిశ దామోదం రాధాక్రిష్ణ, నాయకులు ప్రమీల, వెంకటసుజాత , షేక్‌ఖాజాహుసేన్, అహ్మద్, ఖాద్రిపాష, సత్యరాజు, బజారన్న, చంద్రశేఖర్, నవీన్, వసీబాష, జోసెఫ్ నోయల్, వసీం, దేవిడ్‌పాల్, ఆనందం, ఆశీర్వాదం, రాముడు, రవి, కెవి.లక్ష్మి, లలిత, కరుణమ్మ, హైమావతి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

## నారా హమారా.. టీజీభరత్ హమారా



ప్రచారం చేస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** కర్నూలులో తెలుగుదేశం పార్టీ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో నారా హమారా.. టీజీ భరత్ హమారా నినాదంతో నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రచారం మొదలు పెట్టారు. శుక్రవారం నగరంలోని 6వవార్డు గరీబ్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని కోరారు. పార్టీ తీసుకవచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కర్నూలులో టీజీ భరత్‌ను ఎమ్మెల్యేగా చేసుకుంటే నగరాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా ఆయన బాధ్యతగా చూసుకుంటారని వివరించారు. టీజీ కుటుంబం ముస్లింలకు చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీ జహంగీర్‌బాష, మైనార్టీ కమిటీ నగర అధ్యక్షుడు హమీద్, ప్రధాన కార్యదర్శి మెహబూబ్, ఇమ్రాన్‌సలీం, జుబేర్‌ఖాన్, అబ్దుల్‌రజాక్, మహమ్మద్‌గౌస్,ఖాజామోహిద్దీన్,ఇబ్రహీం,షానవాజ్,షేక్‌మున్నా,జిమ్‌ఖాజా,అబ్దుల్లా పాల్గొన్నారు

## ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు కరాటే సాధన తప్పనిసరి

**– డాక్టర్ పి.చంద్రశేఖర్**



గ్రేడింగ్ బెల్టులు అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు కరాటే సాధన తప్పనిసరి అని డాక్టర్ పి. చంద్రశేఖర్ అన్నారు. యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుండె వైద్యనిపుణులు డాక్టర్ పి.చంద్రశేఖర్ హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులను అభినందించారు. కరాటే, ఉషూ లాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు. కరాటే ఏకాగ్రతను, పట్టుదలను పెంచుతుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు తమకు నచ్చిన క్రీడల్లో రాణించాలన్నారు. ఎగ్జామినర్లుగా సుధాకర్, చిన్నశ్రీనివాసులు, క్రాంతికుమార్ వ్యవహరించారు. కృష్ణారెడ్డి, కరాటే మాస్టర్లు సుధాకర్, చిన్నశ్రీనివాస్, కాంత్రికుమార్ పాల్గొన్నారు.

# అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

**- దామాషా పద్ధతిలో కేటాయింపులు లేవన్న టీడీపీ**
**- నిబంధనల మేరకే కేటాయింపులు చేశామన్న కమిషనర్**



కౌన్సిల్‌లో బడ్జెట్ ప్రవేశపెడుతున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్

**ఎమ్మిగనూరు, మేజర్ న్యూస్ :** 2024-25వ ఆర్థిక సంవత్సరం గాను 68.79కోట్లతో ప్రవేశపెట్టిన ఎమ్మిగనూరు పురపాలక సంఘం అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ రఘు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశం లో వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. మున్సిపల్ సీనియర్ అకౌంటెంట్ శాంతి బడ్జెట్ ను ప్రవేశపెట్టగా అందుకు కౌన్సిల్ సభ్యులు ఎలాంటి సూచనలు చేయకుండానే ఆమోదం తెలిపారు. అనంతరం టీడీపీ ఫ్లోర్‌లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ ప్రతిసారి మాదిరిగానే ఈసారి బడ్జెట్‌లో కూడా దామాషా పద్ధతిలో కేటాయింపులు లేవని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, స్త్రీ, శిశు సంక్షేమంకు జీఓ ప్రకారం ఎందుకు ప్రత్యేక కేటాయింపులు చేయలేదని నిలదీశారు . వికలాంగులకు 3 శాతం నిధులు మంజూరు చేసి వారికి అవసరమైన చోట ర్యాంప్‌లు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా బడ్జెట్‌లో ఆ ఊసే లేదని విమర్శించారు. సవరణ బడ్జెట్ లోనైనా నిబంధనల మేరకు అన్ని వర్గాలకు దామాషా పద్దతిలో నిధుల కేటాయింపులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కమిషనర్ గంగిరెడ్డి సమాధానం ఇస్తూ జీఓ నెంబర్ 157 ప్రకారం 40 శాతం నిధులను మురికివాడల అభి వృద్ధికి కేటాయింపులు చేశామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు దామాషా పద్దతి కన్నా ఎక్కువగానే నిధులను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వికలాంగుల అభ్యున్నతిపై మరింత దృష్టి సారించాల్సిన ఉందని, ఆ దిశగా చర్యలు చేపడుతామని ఆయన హామీఇచ్చారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ నజీర్ అహ్మద్, మేనేజర్ వరప్రసాద్, ఆర్వో బేబీ, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనే వైసీపీ నాయకుల రాజీనామాలు

- **బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం**
- **టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు ఫకృద్దీన్**



టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు ఫకృద్దీన్

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** వైసీపీ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన వైసీపీ నాయకులు ఒక్కొక్కరూ ఆ పార్టీకిరాజీనామాచేస్తున్నారని టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు గడ్డా ఫకృద్దీన్ అన్నారు. శుక్రవారంఆయన మీడియా సమావేశంలోమాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటిపై పన్ను, చెత్తపై పన్ను తదితర అనేక పన్నులతోపాటు నిత్యావసర ధరలను కూడా పెంచేసి పేద ప్రజలపై భారం వేశారని మండిపడ్డారు. ప్రత్యేక హోదాపై ఐదేళ్ల కాలంలో సీఎం కనీసం నోరు కూడా మెదపలేదని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధానే లేకుండా చేశారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని అదోగతిపాలు చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వైసీపీ పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి కాబట్టే వైసీపీ నాయకులు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారని ఆయన గుర్తు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజల అభివృద్ధి ఒక్క టిడిపి పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో టిడిపి, జనసేన పార్టీలు అధికారంలోకి రావడం పక్కా అని, మళ్లీ చంద్రబాబు సీఎం కావడం తథ్యమని ఫకృద్దీన్ స్పష్టం చేశారు.

## 16 నుండి అహోబిలేశ్వరుల పార్వేట ఉత్సవాల ప్రారంభం



కొలువుదీరిన అహోబిలేశ్వరులు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వెలసినఅహోబిలేశ్వరుల పారువేట ఉత్సవాలు ఈనెల 16న మంగళవారం కనుమ రోజున వైభవంగాప్రారంభం కానున్నాయి.ఈ పారువేట ఉత్సవాలు ఆళ్లగడ్డ నియోజకవ ర్గంలోని ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాలలో33 గ్రామాలలో 45 రోజులపాటు పర్యటించనున్నారు.16న రాత్రి అహోబిలేసుని ఉత్సవ పల్లకి బాచేపల్లె గ్రామం చేరుకొని భక్తుల నుండి పూజలు అందుకుంటుంది. అక్కడనుండి 18 న కొండంపల్లి, అదే రోజు మధ్యాహ్నం ఆర్ కృష్ణాపురం 20న కోట కందుకూరు, 21న మర్రిపల్లి, 22న యాదవాడ గ్రామంలో పూజలు అందుకొని 23నరాత్రిరుద్రవరం మండలం ఆలమూరు గ్రామం చేరుకుంటుంది. అక్కడ మూడు రోజులు పాటు పూజలు అందుకొని 26న తిమ్మనపల్లి,27న సాయంత్రం నరసాపురం, 28న రాత్రి ముత్తలూరు, 29న రాత్రి నల్లవాగుపల్లె, 30న ఆళ్లగడ్డ మండలం చదల్లదిన్నె(బాచ్చాపురం మెట్ట), అదే రోజు రాత్రి బాచ్చాపురం,31న నరసరావుపేట (మిద్దెలు ), అదే రోజు రాత్రి ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని నాగిరెడ్డి పల్లె గ్రామం చేరుకుంటుంది. ఫిబ్రవరి 1న రాత్రి పడకండ్ల, 3న ఉదయం ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ పట్టణంలో అహోబిలేశ్వరుల ఉత్సవ పల్లకి వారం రోజులు పాటు పూజలు అందుకుని 9 న ఉదయం లింగందిన్నె గ్రామం చేరుకుంటుంది. అక్కడినుండి 10న ఉదయం సర్వాయిపల్లె, 12న ఉదయం ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుంటుంది. అక్కడ పూజలు అందుకొని అదే రోజు ఉదయం పి చింతకుంట్ల, 13న ఉదయం దేవరాయపురం అదే రోజు రాత్రి గూబగుండం, 14న రాత్రి జంబులదిన్నె 15 రాత్రి రుద్రవరం మండలం మందలూరు, 16న రాత్రి నక్కలదిన్నె,17న రాత్రి చందలూరు, 18న రాత్రి చిలకలూరు, 19న రాత్రి తిప్పారెడ్డిపల్లి, 20 న రాత్రి టి.లింగం దిన్నె, 22న రాత్రి నాగులవరం, 23న రాత్రి రుద్రవరం మండల కేంద్రం చేరుకుంటుంది. అక్కడ ఐదు రోజులపాటు పూజలు అందుకున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి పారువేట ఉత్సవ పల్లకి 29న ఉదయం అహోబిలం పుణ్యక్షేత్రం చేరుకుంటుంది. ఈ సందర్భంగా అహోబిల దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాలా ఆచార్యులు మాట్లాడుతూ అహోబిల క్షేత్రంలో కొలువుదిరిన శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీ ప్రహ్లాద వరద స్వాములు మార్చి మాసంలో జరిగే తమ కళ్యాణోత్సవాలకు భక్తులను స్వయంగా ఆహ్వానించేందుకు సంక్రాంతి పండుగ కనుమ రోజున ఉత్సవాలకు తరలి వెళ్లి మూడు మండలాలలో 33 గ్రామాలలో 45 రోజుల పాటు పర్యటించి గ్రామాలలో ఏర్పాటుచేసిన తెలుపులపై ఆసీనులై భక్తుల నుండి పూజలు అందుకుంటారన్నారు.

## తిరుపతి రైలుకు అదనపు జనరల్ బోగీలు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** సంక్రాంతి సెలవుల దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే శాఖ తిరుపతి రైలుకు మూడు అదనపు జనరల్ బోగీలను ఈనెల 20వ తేదీ వరకు నడుపుతున్నట్లు రైల్వేశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే డబ్లింగ్ పనుల నిమిత్తం రద్దుకాబడిన గుంటూరు- నంద్యాల- కాచిగూడ (17251)ఎక్స్‌ప్రెస్ రైలును కూడా పునరుద్ధరణ చేసినట్లు చెప్పారు. ఈరైలు 15వ తేదీన గుంటూరులో పునః ప్రారంభం జరిగి 21వ తేదీ వరకు తిరుగుతుందన్నారు. అలాగే 17252 కాచిగూడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు కాచిగూడలో 16వ తేదీన పునః ప్రారంభం జరిగి 22వ తేదీ వరకు తిరుగుతాయన్నారు.

సూర్య

శనివారం | 13 జనవరి 2024

# వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

## – సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ :** గాంధీ మహాత్ముడు కలలు గన్న గ్రామస్వరాజ్యం సాధించేందుకు, గ్రామీణాభివృద్ధికి వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో అనేక అభివృద్ధి సాధించామని , పెద్దపీట వేశామని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన, ఎంపీడీఓ సుగుణశ్రీ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నంద్యాల మండల పరిధిలో గ్రామీణాభివృద్ధికి చేసిన వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి తెలిపారు. మండల అభివృద్ధికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచులు, ప్రభుత్వ అధికారులు సహకరించారన్నారు.


మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి


హాజరైన మండల పరిషత్ సభ్యులు

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై అత్యధిక ప్రాధాన్యత కల్పించి అనేక విప్లవాత్మక మార్పులును, బృహత్తర కార్యక్రమాలను చేపట్టామని, తద్వారా జరిగిన ఫలితాలను వెల్లడించారు. అభివృద్ధి అన్నది నిరంతర ప్రక్రియ అని రానున్న కాలంలో మరింత అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు కృషి చేస్తామన్నారు. సచివాలయ సేవల ద్వారా ప్రజలకు అందుతున్న విధానాన్ని వివరించారు. రాయపాడు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చడం జరిగిందన్నారు. గ్రామ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం జొన్న దిగుబడులకు గిట్టుబాటు ధరను రూ.3వేల 180ల మద్దతు ధరను ప్రకటించిందని, రైతులు ఆర్‌బీకేల ద్వారా రైతులు దిగుబడులను అమ్ముకోవచ్చన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు ఈక్రాప్‌పై అవగాహన కల్పించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైయస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, మండల సభ్యులు పాల్గొన్నారు.

# నేరజల్లా సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని రాంపల్లి గ్రామ సమీపంలోని నేరజల్లా సుంకులమ్మ ఆలయంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు యోగేష్ మాట్లాడుతూ నేరజల్లా సుంకులమ్మ ఆలయంకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మవారిని పూజిసేత తమకున్న కష్టాలు తీరుతాయని భక్తుల నమ్మకం అన్నారు. ప్రతి అమావాస్యకు ఆలయంలో రాత్రి నుంచి ఉదయం వరకు పూజలు నిర్వహిస్తారు.


అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

# పేదలకు ఆసరా ఇస్తున్న అభిరుచి మధు

## – నూనెపల్లె, హరిజనవాడల్లో చీరెలు పంపిణీ


చీరెల పంపిణీలో మాట్లాడుతున్న అభిరుచి మధు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్:** పేదలకు సేవ చేయడం దేవుడు ఇచ్చిన వరమని నంద్యాల బీజేపీ కన్వీనర్ అభిరుచి మధు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నూనెపల్లె, హరిజనవాడల్లో 1100మందికి మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం దేవుడు ఇచ్చిన వరమని వ్యాపారలలో సంపాదించిన డబ్బు కంటే సేవలోనే తృప్తి ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదవారికి సేవ చేస్తున్నానని అన్నారు. సంక్రాంతి పండుగకు మహిళలకు తనకు తోచిన విధంగా గోస్పాడు, నంద్యాలలోని నూనెపల్లె హరిజనవాడల్లో చీరెలు పంపిణీ చేశామన్నారు. పట్టణంలో మరిన్ని ప్రాంతాల్లో చీరెలు పంపిణీ చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు ఊహించని విధంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మద్దిలేటి, కృష్ణారెడ్డి, స్వాతి, లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాంటూ

# సంతకాల సేకరణ చేపట్టిన అంన్‌వాడీలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** అంగన్ వాడీల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని, జగనన్నకు చెబుదాం అంటూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి వినూత్నంగా నిరసన చేపట్టినట్లు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు లక్ష్మిదేవి, మంజుల, సిఐటియు నాయకులు ఏసురత్నం, రామ్‌నాయక్, రణధీర్‌లు అన్నారు. శుక్రవారం అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెను చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరి చేయాలన్నారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు ఇవ్వాలన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీల ప్రమోషన్‌లలో రాజకీయ జోక్యం లేకుండా పదువులు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. జగనన్నకు చెబుదాం అంటూ కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుజాత, సుధారాణి, లక్ష్మి, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.


సంతకాలను సేకరిస్తున్న అంగన్‌వాడీ, సిఐటియు నాయకులు

# చిట్టచివరి లబ్ధిదారుడికి చేరవేయడమే లక్ష్యం

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సంతృప్తిస్థాయిలో చిట్ట చివరి లబ్ధిదారుడికి చేరవేయడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమని నగర పాలక సంస్థ టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు సంతృప్తి స్థాయిలో అందించడం, ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వారి అభిప్రాయాలను తెలుసుకొని వికసిత్ భారత సహకారం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వ ఈ యాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల దరికి చేర్చి వారికి అండగా నిలవాలని అన్నారు. ఈ యాత్ర నగరంలోని పలు ప్రదేశాల్లో ఈ నెల 21 వరకు జరుగుతుందన్నారు. అనంతరం యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

# అంగన్‌వాడీలు విధుల్లోకి చేరాలని బలవంతంగా నోటీసులు

**ఆస్పరి, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడి సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే, విధుల్లోకి చేరాలని బలవంతంగా నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని, విఆర్‌ఓ, సచివాలయ ఉద్యోగులు, తలారులను అదుపు చేయాలని ఏఐటీయుసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, సీఐటీయు మండల గౌరవ ఉపాధ్యక్షులు బాలకృష్ణలు పేర్కొన్నారు. శుక్రవారం ఏపి అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు ప్రమీలమ్మ, విజయ లక్ష్మి అధ్యక్షతన 32వ రోజు దీక్ష శిభిరం నిర్వహించారు. అంగన్‌వాడీలకు తక్షణమే జీతాలను పెంచాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీలపై ఏస్మా చట్టాన్ని ఉపయోగించి విధులకు హాజరు కావాలని అంగన్‌వాడి టీచర్స్, హెల్పర్స్ విఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు, తలారులు ఇండ్ల వద్ద వెళ్లి దౌర్జన్యంగా, బలవంతంగా నోటీసులు తీసుకోవాలని బెధిరింపులకు పాల్పడుతున్న విఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు, తలారులను ఉన్నతాధికారులు అదుపు చేయాలని లేకపోతే మీ అంతు చూస్తామని హెచ్చరించారు. తెలంగాణ మాదిరిగా వేతనాలను పెంచలని, రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న టిఏ, డిఏలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కుమారస్వామికి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగస్వామి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవి, మురళీ, ఏఐటీయుసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, మండల అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్, హనుమంతు, ఏపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకురాలు సజీవమ్మ, సరోజమ్మ, ఛాయాదేవి, రాణి తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

# మళ్లీ సర్పంచుల ఖాతాలు ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకిస్తున్నారు. ఇటీవలే వారు కేంద్రప్రభుత్వానికి ఈ వ్యవహారంపై ఫిర్యాదు కూడా చేశారు. కేంద్ర ప్రతినిధులు ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇదంతా ఒకవైపు జరుగుతుండగానే మరోవైపు తాజా నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం మళ్లించేయడాన్ని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ తీవ్రంగా నిరసించింది. ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ తాజాగా తమ ఖాతాల నుండి ప్రభుత్వం దొంగలించిన 600 కోట్ల రూపాయల నిధులను నాలుగు రోజుల్లో ఆయా ఖాతాల్లో జమచేయాలని, లేకపోతే పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 12,918 గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి రెండవ విడతగా 988 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని, ఆ నిధులను సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్పీటీసీలు, ఎంపిపి, జిల్లా పరిషత్ చైర్మన్లకు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చిందని ఆయన చెప్పారు. కానీ కేంద్రం 393 కోట్ల రూపాయలు మాత్రమే శుక్రవారం ఆయా ఖాతాల్లో జమచేయబడ్డాయని, మిగిలిన 600 కోట్ల రూపాయలను మళ్లించేశారని ఆయన తెలిపారు. గతంలో కూడా 8,629 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రతి నిధులకు తెలియకుండానే దారి మళ్లించేసిందని ఆయన చెప్పారు. 8,629 కోట్ల రూపాయల నిధులను స్థానిక సంస్థల ఖాతాలో జమ చేయాలంటూ తాము ఆందోళనలు చేస్తుంటే వాటిని పట్టించుకోకుండా తాజా నిధులను కూడా దారి మళ్లించేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

## యువతలో అనంతమైన శక్తి

# దాగి ఉంది

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** యువతలో అనంతమైన శక్తి దాగి ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. వివేకానంద జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని రాజ్‌విహార్ సెంటర్‌లో వివేకానంద విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగాలుగా కాకుండా వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దాలన్నారు. లక్ష్యం, దీక్షతో శ్రమిస్తే తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్‌యాదవ్, లోకేశ్వరయ్య, మధుగౌడ్, భగత్ పాల్గొన్నారు.

# బీసీల గొంతు కోస్తున్న జగన్

## – బీసీలంతా ఐకమత్యంగా వైసీపీని తరిమి కొడదాం

## – టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్

**నంద్యాల, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ వర్గాలను, కులాలను అణగదదొక్కుతూ బీసీల గొంతు కోస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి కుర్చీనుండి దించడమే లక్ష్యంగా టీడీపీ నాయకులు కార్యకర్తలు సంఘటితం కావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఏవీ ఆర్ ప్రసాద్, జిల్లెల్ల శ్రీరాములు పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బోయ గోవింద నాయుడు, జిల్లా వాల్మీకి సాధికార సమితి అధ్యక్షుడు బోయరామకృష్ణ, నంద్యాల అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కాశన్న, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, రమణ, కుర్నీ సాలె సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యలతో కలిసి టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు మాట్లాడారు. ఏవీ ఆర్ ప్రసాద్, శ్రీరాములు మాట్లాడుతూ చంద్రబాబు సొంత కాళ్ళపై నిలబెట్టే సంక్షేమ పథకాలు అమలుచేస్తే జగన్‌రెడ్డి కాళ్లు విరిచికట్టుకట్టాడు అని ఎద్దేవా చేశారు. రూ.75వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించిన బీసీల ద్రోహి జగన్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌టీఆర్, చంద్రన్న 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తే జగన్ రెడ్డి 24శాతం కుదించి 16,800 రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేశారని విమర్శించారు. టీడీపీ హయాంలో కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ద్వారా 4లక్షల మందికి రూ.3,700కోట్లు రుణాలుగా ఇస్తే 56 కార్పొరేషన్లు పెట్టిన జగన్‌రెడ్డి రూపాయి ఖర్చు చేయలేదని మరోసారి ఓట్ల కోసం బీసీలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు 5వేల మందికి విదేశీ విద్య, లక్షన్నర మందికి స్టడీ సర్కిల్స్ ద్వారా శిక్షణ, 2.13లక్షల మందికి స్కిల్ డెవలెప్‌మెంట్ ద్వారా శిక్షణ, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ వంటి పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశాడన్నారు.


బీసీల సమావేశంలో మాట్లాడుతున్న ఏవీ ఆర్ ప్రసాద్

## డోన్‌లో జరిగే ముస్లీం మైనారిటీ సమావేశాన్ని విజయవంతం చేయండి




**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హల్ నందు నేడు జరిగే ముస్లిం మైనారిటీ కార్యక్రమాన్ని ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎంపిటిసి ముస్లిం నాయకులు జాకీరుల బేగ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్ నందు జరిగే ముస్లిం మైనార్టీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనమండలి చైర్మన్ షరీఫ్, డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి హాజరవుతారని కావున డోన్ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ సోదరులందరూ పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫయాజ్, జాక్రియా, అంజాద్ , సిద్దిక్, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రానికి స్వర్ణయుగం

### – గౌరు దంపతులు


మాట్లాడుతున్న గౌరు దంపతులు

**కల్లూరు, మేజర్‌న్యూస్:** టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రంలో స్వర్ణయుగం రానుందని, రానున్న ఎన్నికల్లో భస్మాసురుడు జగన్ పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు గౌరువెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలోని తమ నివాసంలో వారు విలేఖరులతో మాట్లాడారు. ఆళ్ళగడ్డలో జరిగిన చంద్రబాబునాయుడు రా కదలిరా కార్యక్రమం విజయవంతమైందన్నారు. విజయవంతం చేసిన పాణ్యం నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలుక కృతజ్ఞతలు తెలిపారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిన మేలు ఏమీ లేదని, విధ్వంసం, అరాచకం, దౌర్జన్యం, దోపిడీ మాత్రమేనన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి సృష్టించబోతున్న సునామీలో వైసీపీ గల్లంతు కావడం ఖాయమన్నారు. బాబుష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీతో ప్రజల జీవితాలకు ఒక భరోసా వస్తుందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. రానున్న తెలుగుదేశం పాలనలో అన్ని పరిశ్రమలకు మంచి రోజులు రానున్నాయన్నారు.

## వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న దృశ్యం

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** స్వామివివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని కర్నూలు జిల్లా బార్ అసోసియేసన్ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జయరాజు, లీగల్ సెల్ కన్వీనర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## టీడీపీ కర్నూలు అర్బన్ అధ్యక్షునిగా పెరుగు పురుషోత్తంరెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు అర్బన్ 16వవార్డుల అధ్యక్షునిగా పెరుగు పురుషోత్తంరెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా పెద్దపాడు పెద్దబీచుపల్లిని ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి వారికి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల పార్లమెంటు అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, లక్ష్మిపురం రాధాక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

### తహశీల్దార్ కార్యాలయంలో

## డిష్యుం.. డిష్యుం..?

### – థియేటర్ల లైసెన్స్‌పై అధికారుల మధ్య వాగ్వాదం



ఎమ్మిగనూరు తహశీల్దార్ కార్యాలయం

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్:** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఇద్దరు అధికారుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ స్థాయిలో కొట్టుకునేదాక వెళ్లగా తోటి ఉద్యోగులు అడ్డుగా వెళ్లి నివారించారట. వివరాల్లోకి వెళితే సినిమా థియేటర్ల లైసెన్స్ రెన్యూవల్ విషయమే గొడవకు కారణమని తెలుస్తోంది. తహశీల్దార్ కార్యాలయంలోని ఓ అధికారి థియేటర్ల లైసెన్స్ రెన్యూవల్ కోసం యజమానుల వద్ద ఓ మొత్తాన్ని ఢీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే రెన్యూవల్ విషయమై కింది స్థాయి అధికారిపై నిత్యం ఒత్తిడి పెంచుతున్నారట. ఢీల్ కుదుర్చుకున్న విషయాన్ని పసిగట్టిన కింది స్థాయి అధికారి లైసెన్స్ రెన్యూవల్ ఫైల్ పై జాప్యం చేస్తూ వస్తున్నాడు. దీంతో కోపోద్రిక్తుడైన పైస్థాయి అధికారి శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో కింది స్థాయి అధికారి పై ఇదే విషయమే ఆగ్రహం వ్యక్తం చేశారట. ఈ సందర్భంగా ఇరువురు మధ్య మాటామాట పెరిగి చివరికి డిష్యుం..డిష్యుం స్థాయికి వెళ్ళింది. కార్యాలయంలో కొట్టకుంటే పరువుపోతుందని భావించిన తోటి సిబ్బంది ఇరువురు మధ్య అడ్డుగా నిలిచి కింది స్థాయి అధికారిని బయటకు తీసుకురావడంతో గొడవ సద్దుమణిగిందట. అయితే నన్నే ఎదిరించి మీదమీదకు వస్తాడా?.. అంటూ ఆ.. పై అధికారి కింది స్థాయి అధికారిపై అగ్గిమీదగుగ్గిలమై సరెండర్ చేసి నా ప్రతాపం ఏంటో చూపిస్తానని శపథం పూనాడట. ఈ గొడవపై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇరువురుపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా..? లేదా లైట్ గా తీసుకుంటారా... అనే విషయమై వేచి చూడాల్సిందే..!

## యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

### – టీడీపీ కర్నూలు పార్లమెంటు సీటును రాంపుల్లయ్యయాదవ్‌కు కేటాయించాలి

### – యాదవ ఐక్య సంఘాల జేఏసీ డిమాండ్


మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

**కల్లూరు, మేజర్‌న్యూస్:** యాదవులకు రాజకీయంగా ఏ పార్టీ ప్రాధాన్యతను ఇస్తుందో ఆ పార్టీకి యాదవుల సంపూర్ణ మద్ధతు ఉంటుందని, లేని పోంలో యాదవుల సత్తా చూపించే సమయం కూడా ఆసన్నమైందని యాదవ సంఘాల జేఏసీ స్పష్టం చేసింది. శుక్రవారం నగరంలోని ఆర్‌ఆర్ హాస్పిటల్‌లో నిర్వహించిన వలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాయలసీమలో 52నియోజక వర్గాల్లో వైసీపీ పార్టీ ఒక్క యాదవ కూడా టికెట్ కేటాయించకపోవడం శోచనీయమన్నారు. యాదవులు ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పనికి రారా అని, ఎన్నికల్లో ఓట్లు వేసేందుకే పనికి వస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ జిల్లాలో యాదవులకు సీట్లు కేటాయించకపోవడం దారుణమన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు అయిన యాదవులకు సముచిత స్థానం కల్పించాలని, లేని పక్షంలో ఈ పార్టీలకు కూడా బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. రాంపుల్లయ్యయాదవ్‌కు కర్నూలు పార్లమెంటు సీటు కేటాయించాలని టీడీపీని డిమాండ్ చేశారు. టీడీపీ అధిష్టానాన్ని కూడా కలిసేందుకు యాదవులంతా సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు బాలమద్దయ్యయాదవ్, అయ్యన్నయాదవ్, సింధు నాగేశ్వరరావుయాదవ్, సోమన్నయాదవ్, క్రిష్ణమూర్తి యాదవ్, క్రిష్ణయాదవ్ పాల్గొన్నారు.

## యువత క్రమశిక్షణతో సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి


స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అభిరుచి మధు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత క్రమశిక్షణతో సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అభిరుచి మధుతో పాటు పట్టణ అధ్యక్షులు కశెట్టి చంద్రశేఖర్, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు స్వాతి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని అన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడుస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, మండల అధ్యక్షులు గురుబ్రహ్మం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సమరసన సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో :** స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని పట్టణంలోని బైటిపేటలో నిర్వహించిన కార్యక్రమానికి సీఏ బాలవీరయ్య, చింతలపల్లె వాసు, అపర్ణ దీపిక, చందు సత్యంరెడ్డి, బైటిపేట మహిళలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వాసు, వీరయ్యలు మాట్లాడుతూ అమెరికాలోని చికాగోలో ఆయన ప్రసంగం యువతను మేల్కొల్పిందన్నారు.

## బీసీలను గుర్తించిన పార్టీ తెలుగుదేశం పార్టీ

### మొలగవల్లి, చిప్పగిరిలో జయహెూ బిసిల సభలో పాల్గొన్న కోట్ల సుజాతమ్మ

**ఆలూరు,మేజర్ న్యూస్..** దేశంలో బిసి లను గుర్తించి వారికి చట్ట సభల్లో అవకాశం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆలూరు టీడీపీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం ఆలూరు మండలంలోని మొలగవల్లి, చిప్పగిరి గ్రామాల్లో జరిగిన జయహెూ బిసి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెదేపా స్థాపించిన వెంటనే పట్వారీ,పటేల్ వ్యవస్థలను రూపుమాపి బిసిలకు రాజకీయ అవకాశాలు కల్పించారని నాడు చట్టసభల్లో కేవలం అగ్రవర్ణాల వారు మాత్రమే ఉండేవారని ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుండి యనమల, అయ్యన్న,గట్టు భీముడు, పార్థసారథి లాంటి బిసిలకు చట్టసభల్లో స్థానం కల్పించి వారిని ఎమ్మెల్యే, ఎంపిలుగా చేశారని అన్నారు. మొలగవల్లి లో జరిగిన జయహెూ బిసి సమావేశానికి భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు, ప్రజలు హాజరయ్యారు. అనంతరం బిసి సంఘం జిల్లా అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, మాజీ జడ్పిటిసి మీనాక్షి నాయుడు,రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి మనేకుర్తి రాజశేఖర్, రాంనాథ్ యాదవ్, మండల కన్వీనర్ అశోక్ యాదవ్ లు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో బిసీలకు ఎంపిపి, జడ్పిటిసి, మార్కెట్ యార్డు చైర్మన్, జడ్పి చైర్మన్ లాంటి పదవులు పొందారంటే అది ఎన్టీఆర్ పుణ్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలను గుర్తించిన టీడీపీకి, వారిని ఆదరించిన కోట్ల సుజాతమ్మ ను గెలిపించాలని అన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మీ రెడ్డి, మాజీ ఎంపిటిసి లు ఈ రప్ప, తిమ్మప్ప యాదవ్,రంగస్వామి, మండల కన్వీనర్ లు విజయభాస్కర్, తిప్పయ్య,సుధాకర్,షేక్షావలి,రఘురెడ్డి, మాజీ ఎంపిపి కృష్ణ యాదవ్, మురళిరెడ్డి, విష్ణురెడ్డి, అంజినయ్య, కేదార్‌గౌడ్, గోపాల్, దేవేంద్ర, మద్దిలేటి యాదవ్, ముత్తుకూరు మల్లికార్జున, తిమ్మారెడ్డి యాదవ్, నరసప్ప, మసాలజగన్, అట్టేకల్ రాజశేఖర్, రాము యాదవ్, తిమ్మయ్య, కిష్టప్ప, మాణిక్య, యంకన్న, చాకలి గోపాల్, హాజీ, రామాంజి, నెట్టేకల్, బంగి మారుతి, జనసేన నాయకులు చంద్రమౌళి, రామాంజి, రాముడు, సుమన్, ప్రకాష్, రామకృష్ణ, ఐకాంత్, జలందర్, మురళి, చంద్ర, పక్కీరప్ప, శీను, శ్రీధర్, ఈరన్న, జగన్నాథ్ అంజిలు పాల్గొన్నారు.


కోట్ల సుజాతమ్మకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు



జయహెూ బిసి సభకు హాజరైన టీడీపీ శ్రేణులు

# అరాచకం.. ఏడేళ్ల బాలికపై అత్యాచారం



**దేవనకొండ ,మేజర్ న్యూస్ :** కళ్ళకు కామం నించుకున్న కామాంధులు రోజు రోజుకు పెరిగిపోతున్నా రు.ఏ పసి పిల్లలైనా తమ పిల్లల్లాగే కదా అని చూడకుండా కేవలం కామంతో అణ్యం పుణ్యం ఎరుగ ని బాలికలపై కొందరు దుర్మార్గులు అత్యాచారం చేసి శుంకానందం పొందుతారు.తప్పు చేసి తప్పించుకోలేముఅనితెలిసి కూడా ఇలాంటి అరాచకాలకు పాల్పడం సభ్య సమాజానికే సిగ్గుచేటు. వివరాల్లోకి వెళితే మండల ఫరిదిలోని పి కోటకొండ గ్రామంలో ఏడేళ్ల బాలికపై అత్యాచారం జరిగినఅరాచక ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది.వివరాల మేరకు గ్రామంలోని మునిరంగడు అనే 30 ఏళ్ళ వ్యక్తి తన ఇంటి సమీపంలో ఆటలాడుకునేందుకు వచ్చిన బాలికపై కన్నేసిన ఆ కామాంధుడు ఆ బాలికకు మాయ మాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు.తనకేమి జరిగిందో తెలియని ఆ పసికందు ఏడుస్తూ తీవ్ర రక్తస్రావంతో బయటకు రావడం చూసిన చుట్టుపక్కల ప్రజలు ఓదారుస్తూ విషయం తెలుసుకుని అవాక్కయ్యారు. బాలికను వెంటనే తల్లిదండ్రుల దగ్గరకు తీసుకెళ్లి జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక యస్.ఐ.భూపాలుడు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడి కోసం గాలిస్తున్నారు. బాలికను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**నిందితుడి కోసం గాలిస్తున్నాం : యస్ఐ భూపాలుడు :** బాలికపై అత్యాచారం ఘటన చాలా బాధాకరం విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులతో కలిసి గ్రామానికి చేరుకున్నాం.నిందితుడు అప్పటికే పారిపోవడం జరిగింది.నిందితుడి కోసం ఇప్పటికే గాలింపు చర్యలు చేపట్టాం నిందితుడు ఎంతటి వాడైన సరే ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటామని తెలిపారు.

# తెలుగుదేశం పార్టీ గెలిస్తేనే యువతకు భవిష్యత్తు

**: టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్**



మాట్లాడుతున్న టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిస్తేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని మౌర్య ఇన్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు చేపట్టిన రా కదలిరా కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. పెరిగిపోయిన నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీలు, పన్నులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతునన పరిస్థితులు చూస్తున్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ధరలు నియంత్రణలో ఉంటాయన్నా భరోసా ప్రజలకు ఇస్తున్నామని తెలిపారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో యువతకు భారీగా ఉద్యోగవకాశాలు వస్తాయన్నారు. ఇక కర్నూలులో ప్రస్తుతం ప్రజలు పడుతున్న ఇబ్బందులు తీరాలంటే వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్రజలకు సేవ చేయాలన్న ఉద్ధేశ్యంతోనే తాను రాజకీయాల్లో ఉన్నానని టీజీ భరత్ తెలిపారు.

# ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

**– హెచ్ఐవీ భాధితులతో అల్పాహార విందులో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంఎదురుగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధితులతో జిల్లా కలెక్టర్ జి.సృజన అల్పాహార విందులో పాల్గొన్నారు. వారితో కలిసి కలెక్టర్ సహపంక్తిలో అల్పాహారం తీసుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో పాల్గొని ఎయిడ్స్ పట్ల వివక్ష వద్దు అనే సందేశాన్ని సమాజానికి అందించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బి.వై.రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన ఎంతో అవసరమని, ఈ వ్యాధిని అరికట్టడానికి మందులు ఉన్నాయన్నారు. ఈ వ్యాధి నివారణకు ముందస్తుగా వ్యాధిగ్రస్తులకు భరోసా కల్పిస్తే పూర్తిగా నివారించవచ్చన్నారు. ఎయిడ్స్‌ను నివారణ లేని వ్యాధిగా చూడకూడదన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ తరహాలో హెచ్ఐవీ అనేది ఒక వ్యాధి అని, దీనికి చికిత్స ఉందన్నారు. అల్పాహార ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఎన్‌జీవో నాగరాజును జిల్లా కలెక్టర్ అభినందించారు. నగర మేయర్ బి.వై.రామయ్య మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు దైనందిన జీవితంలో చక్కటి క్రమశిణతో మందులు తీసుకుంటే ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. అనంతరం ఎయిడ్స్ నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించి బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూధన్‌రావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి ఎల్. భాస్కర్, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి, మైనార్టీ సంక్షేమ అధికారి సభిహా పర్వీన్, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ మల్లికార్జున రెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ అలీహైదర్, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షురాలు సుధారాణి, ఏపీ శాక్స్ పార్టనర్స్, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, దాత విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



అల్పాహార విందులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జి.సృజన

# నిధి,వజ్రాల కోసం..శ్రీవనం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పచ్చులబండ ధ్వంసం



శ్రీ వనం లక్ష్మీ వెంకటేశ్వర స్వామి గుడి (ఫైలు ఫోటో)

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** పురాతన, ప్రాచీన, ప్రసిద్ధి చెందిన ఆలయాలలో ఆనాడు రాజులు వజ్జాలు, వైడుర్యాలు, బంగారు నాణేలు దొంగల భారి నుండి రక్షించేందుకు దాచిఉంటారన్న మూఢనమ్మకంతో నేడు అనేక దేవాలయాలు దుండగుల దాటికి ధ్వంసాలకు గురౌతున్నాయి. దేవుడు అంటే భయంలేక పోగా చివరికి దేవాలయంలో ఉలుకూపలుకూలేని రాతి విగ్రహం ఏమి చేస్తుందనే దురాలోచనలతో ఆలయాలను కొందరు దుండగులు గునపాలతో, యంత్రాల సాయంతో శిథిలం చేస్తున్నారు. ఆనాడు విదేశీయుల నుండి మన పూర్వీకులు దేవాలయాలను రక్షించుకోవడం ప్రాణాలను సైతం పన్నంగా పెట్టింటే నేడు స్వదేశానికి చెందిన వారే ఇలా దేవాలయాలను నిధి వేటలో దేవుళ్ళకే గుణపాల పోటు పొడవడం దారుణమనే చెప్పాలి..

ఇక అస్సలు విషయానికి వస్తే పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం, రామళ్ళకోట గ్రామంలో వెలసిన శ్రీవనం వేంకటేశ్వరస్వామి ఆలయం ఎన్నో ఏళ్ళనాటి పురాతనమైన, ప్రాచీనమైన దేవాలయం. ఇలాంటి ఆలయంలో కొందరు దుండగులు వజ్రాలు ఉంటాయనే దురుద్దేశ్యంతో గురువారం అర్ధరాత్రి ఆలయంలోని పచ్చుల బండపై కప్పును ధ్వంసం చేశారు. వజ్రాలు ఉన్నాయని దేవాలయం పై భాగంలో ఉండే బొంగరం లాంటి ప్రతిమను బద్దలు కొట్టారు. రాత్రి ఘటన జరగడంతో శుక్రవారం తెల్లవారు జామున గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసుల దృష్టికి తీసుకెళ్ళారు. వెల్దుర్తి ఎస్సై పి.చంద్రశేఖర్‌రెడ్డి తన పోలీసు సిబ్బందితో ఆలయాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.గ్రామపెద్దలు మాట్లాడుతూ రామళ్ళకోట గ్రామానికి జిల్లాలోనే ప్రత్యేకమైన పేరు ఉందని, కర్నూలు జిల్లా కాకమునుపు రామళ్ళకోట జిల్లా కేంద్రంగా కొనసాగినట్లు పెద్దలు తెలుపుతుంటారన్నారు. అలాంటి గ్రామంలో పురాతనమైన దేవాలయం శ్రీవనం వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఒక చరిత్ర ఉంది. ఈ దేవాలయంలో పచ్చుల బండ ఉంది. చుట్టుపక్కల గ్రామాలలో ఎవ్వరైనా తప్పు చేసినా వారు ఆ పచ్చుల బండపై నిలబడి ప్రమాణం చేసినచో నిజం చెప్పే వారికి ఏమి జరగదని, తప్పు చేసినవారికి శిక్ష తప్పదని ప్రజల నమ్మకం. ఇలాంటి ఆలయంలో అమావాస్య రోజు దొంగతనం జరగడం చాలా దురదృష్టకరమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పచ్చులబండపై ఉన్న గోపురాన్ని ధ్వంసం చేసి విలువైన నిధుల కోసం దుండగులు వెతకడానికి ప్రయత్నించినట్లు తెలుస్తుంది. దీంతో గ్రామంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు.



గుళ్లో ఉన్న పచ్చల బండ (ఫోటో)

# కాంట్రాక్టర్ కూలీ డబ్బులు ఇవ్వలేదని మేస్త్రి సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యా యత్నం

**మా కూలీ డబ్బులు ఇప్పించండి సార్..**

**సిఐకి మోర పెట్టుకున్న బాధితుడు**

**బేతంచర్ల,మేజర్‌న్యూస్ :** ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగ్రామం బేతంచెర్లలలో మంత్రి ఇంటికి సమీపాన గల సెల్ టవర్ ఎక్కి ఒక మేస్త్రి గుత్తేదారుడు పని చేయించుకొని కూలి డబ్బులు సుమారు రూ. 10. 40 లక్షలు ఇవ్వడం లేదని ఆత్మహత్య యత్నం చేసుకున్న సంఘటన శుక్రవారం బేతంచెర్ల పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు గ్రామానికి చెందిన సత్యనారాయణ,అయన కుమారుడు సతీష్ ఇరువురు పిటిఆర్ బ్రదర్ ప్రాజెక్ట్స్ కంపెనీలో బేతంచర్ల,డోన్ మండలాలలో ఆర్ అండ్ బి పనులైన బ్రిడ్జిలు, వంతెనలు,సెంట్రింగులు,రాడ్ బెండింగ్ పనులు కార్మికులచేత పనులు చేపిస్తూ నిర్మాణాలు చేపట్టారు. డోన్ నుంచి కొచ్చేరువు ఐదు బ్రిడ్జి పనులు, ఆర్ ఎస్ రంగాపురం మద్దిలేటి స్వామి గుడి దగ్గర ఒక బ్రిడ్జి,బేతంచెర్ల అయ్యాలచెర్వు దగ్గర రెండు బ్రిడ్జిలు పూర్తి చేశామని తెలిపారు. అయితే గుత్తేదారుడు పైడాల బలరామిరెడ్డి అలియాస్ పిటిఆర్ టెండర్లు వేసి నిర్మాణాలను చేస్తున్న విషయం విధితమే. కాంట్రాక్టర్ పిటిఆర్ తనకు 16 నెలలు ,నాకుమారుడు సతీష్‌కు 11నెలలు మొత్తం 27 నెలలు బ్రిడ్జి పనులు చేయించుకొని డబ్బులు ఇవ్వడం లేదని ఫోన్ చేస్తుంటే స్పందించడం లేదని వాపోయారు. మేస్త్రి సత్యనారాయణ, ఆయన కుమారుడు సతీష్ తండ్రీ కొడుకులిద్దరూ వంతెనలను నిర్మించిన కార్మికులకు బయట అధిక వడ్డీలతో అప్పులు చేసి చెల్లించడంతో అప్పులిచ్చిన వారు ఒత్తిడికి గురి చేయడం, కాంట్రక్టర్ పిటీఆర్ ఎన్నిసార్లు అడిగిన స్పందించకపోవడం, బెదిరింపులకు గురి గురిచేయడంతో దిక్కుతోచని స్థితిలో సత్యనారాయణ తమకు చావే శరణ్యమని భావించి సెల్ టవర్ ఎక్కి, ఆత్మహత్య చేసుకుని చనిపోతానని ఏడుస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రియతమ రెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి విచారించగా గుత్తేదారుడు తండ్రి కొడుకులకు 27 నెలలుగా రూ. 10.40 లక్షలు చెల్లించకుండా ఇబ్బందుల గురి చేస్తున్నాడని, డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నాడని సీఐ ప్రియతమ రెడ్డికి బాధితుడు సత్యనారాయణ మొరపెట్టుకున్నారు. మీకు రావాల్సిన డబ్బులు పూర్తిగా చెల్లించే బాధ్యతను తీసుకొని మీకు న్యాయం చేస్తానని, హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించి టవర్ దిగాడు.అనంతరం సీఐ ప్రియ తమ్ రెడ్డి సంబంధిత మేనేజర్ ప్రసాద్ తో మాట్లాడం తోవారు ఈ నెల20వ తేదీన వచ్చి వారికి రావాల్సిన డబ్బులు చెల్లిస్తామని హామీ హామీ ఇవ్వడంతో కథ సుకాంతమైంది.ఇకపోతే గుత్తేదారుడు పీటీఆర్ కూలి పనులు చేసుకునే మేస్త్రీని ఇబ్బందులకు గురిచేయడం ,బెదిరింపులకు పాల్పడడం దారుణమని మండల ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.



సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న వ్యక్తి



నిరసన తెలుపుతున్న వ్యక్తి ని విచారిస్తున్న సీఐ